ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
సోమవారం 29 జనవరి 2024


గర్భగుడిలో మల్లన్నకు హారతినిస్తున్న వీరశైవార్చకులు


రాజగోపుర ప్రాంగణంలో భక్తజనసందోహం

బోనమెత్తిన లష్కర్

7 వ పేజీ



● కొమురవెల్లి మల్లన్నకు లష్కర్ బోనాలు ● పోటెత్తిన భక్తులు

కోట్లు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు


సంగారెడ్డిలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

మున్సిపాలిటీల్లో నిరుపయోగంగా దుకాణ సముదాయాలు

- సంగారెడ్డిలో 55, జహీరాబాద్‌లో 67, సదాశివపేటలో 32 దుకాణాలు
- అద్దెకిచ్చేందుకు అవకాశమున్నా పట్టించుకోని యంత్రాంగం
- ఆదాయాన్ని కోల్పోతున్న బల్దియాలు
- చిరు వ్యాపారులకు ఇబ్బందులు

సంగారెడ్డి టౌన్, జనవరి 28: సంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన దుకాణ సముదాయాలు నిరుపయోగంగా మారాయి. దుకాణాలను అద్దెకిస్తే ఆదాయం సమకూరే అవకాశం వున్నప్పటికీ అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. సంగారెడ్డి గ్రేడ్‌వన్ మున్సిపాలిటీతో పాటు జహీరాబాద్, సదాశివపేట పట్టణాల్లో కోట్లాది రూపాయలు ఖర్చుతో నిర్మించిన దుకాణ సముదాయాలు నిరుపయోగంగా ఉన్నాయి. చిరు వ్యాపారులు, కూరగాయలు, ఇతర విక్రయదారులు రోడ్ల పక్కనే విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సంగారెడ్డి బల్దియాలో 55 దుకాణాలు

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని గంజిమైదాన్‌లో కూరగాయల వ్యాపారులు, చిరు వ్యాపారుల కోసం నిర్మించిన 55 దుకాణాలు నిర్మించారు. 2005లో ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ స్మాల్ మీడియం టౌన్ ప్రణాళిక కింద రూ.1.38 కోట్ల నిధులతో దుకాణ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయిన 2022 జూలై 19న అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. వీటిని అద్దె ప్రాతిపదికన చిరువ్యాపారులకు కేటాయించాలని అప్పట్లో మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ దుకాణ సముదాయాలను నిర్మించి 18 నెలలు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాలేదు. ఒక్కో దుకాణానికి సరాసరిగా నెలకు రూ.5వేల చొప్పున అద్దెకిచ్చినా 55 దుకాణాలకు నెలకు దాదాపు రూ.2.75లక్షల ఆదాయం సమకూరేది. ఈ లెక్కన దుకాణ సముదాయాల నుంచి 18 నెలలుగా రూ.1.98 కోట్ల ఆదాయాన్ని సంగారెడ్డి మున్సిపాలిటీ కోల్పోయింది.

జహీరాబాద్‌లో రూ.10 కోట్లు వెచ్చించి నిర్మాణం

జహీరాబాద్‌లో రూ.10 కోట్లు వెచ్చించి సమీకృత దుకాణ సముదాయాన్ని నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 33, మొదటి అంతస్తులో 34 షెట్టర్లు నిర్మించారు. వీటిని 2023 ఫిబ్రవరిలో వేలం ప్రక్రియ పూర్తిచేసినా చిరువ్యాపారులకు కేటాయించడంలో బల్దియా అధికారులు జాప్యం చేస్తున్నారు. వేలంలో దుకాణాలను దుక్కించుకున్న చిరువ్యాపారులు రూ.50వేల చొప్పున డిపాజిట్లు చేసి రూ.2 లక్షల విలువైన సాల్వెన్సీ సర్టిఫికెట్లు సైతం సమర్పించినప్పటికీ అధికారులు వాటిని అప్పగించడం లేదు.

సదాశివపేటలో శిథిలమవుతున్న దుకాణాలు

సదాశివపేటలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన 12 సంవత్సరాల క్రితం నిర్మించిన 12 దుకాణ సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 2011 సంవత్సరంలో రూ.20 లక్షలతో నిర్మించారు. 12 ఏళ్ల నుంచి వీటిని వినియోగంలోకి తీసుకురావడం లేదనే విమర్శలున్నాయి. వీటి వల్ల ప్రతీనెల దాదాపు రూ.60 వేల చొప్పున మున్సిపల్ ఆదాయాన్ని కోల్పోతున్నది. పట్టణ పరిధిలోని సిద్దాపూర్ రోడ్డులో మూడేళ్ల క్రితం నిర్మించిన 20 దుకాణాలను కూడా చిరు వ్యాపారులకు కేటాయించకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలో నిరుపయోగంగా ఉన్న దుకాణ సముదాయాలను వినియోగంలోకి తేవాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.


సదాశివపేటలో శిథిలమవుతున్న దుకాణ సముదాయం


జహీరాబాద్‌లో ఉపయోగంలోకి రాని షాపింగ్ కాంప్లెక్స్

మెదక్ జిల్లాలో 10 మంది సీఐల బదిలీలు

మెదక్ అర్బన్, జనవరి 28: మెదక్ జిల్లా పరిధిలోని పలువురు సీఐలు ఆదివారం బదిలీ అయ్యారు. మల్టీజోన్-1 పరిధిలోని 10 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ డాక్టర్ తరుణ్‌జోషి ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... సీసీఎస్ మెదక్ సీఐగా పనిచేస్తున్న ఎస్. దిలీప్‌కుమార్‌ను మెదక్ టౌన్ సీఐగా, మెదక్ టౌన్ సీఐగా పనిచేస్తున్న బి. వెంకటేశ్‌ను రామాయంపేట సీఐగా, రామాయంపేట టౌన్ సీఐ టీ.లక్ష్మీబాబును ఐజీ కార్యాలయానికి, ఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న ఎం. రేణుకను అల్లాదుర్గం సీఐగా, బిచ్‌కుందలో పనిచేస్తున్న ఆర్.కృష్ణను తూప్రాన్ సీఐగా, తూప్రాన్ టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న టీ. శ్రీధర్‌ను ఐజీ కార్యాలయానికి, ఐజీ ఆఫీసులో వెయిటింగ్‌లో ఉన్న ఎస్. సురేష్‌కుమార్‌ను మెదక్ సీసీఎస్‌కు, గజ్వేల్ సీఐ రంగా కృష్ణను నర్సాపూర్ సీఐగా, నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మదర్‌ను ఐజీ కార్యాలయానికి, అల్లాదుర్గం సీఐ ఎం. జార్జ్‌ను ఐజీ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి


చౌటకూర్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కాటేపల్లి వెంకటరమణారెడ్డి

పుల్‌కల్, జనవరి 28: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ పుల్కల్, చౌటకూర్ మండలాల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలను పటిష్టం చేయాలని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న కమిటీలను నియమించి పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాన కమిటీలతో పాటు అనుబంధ విభాగాల కమిటీలను పూర్తిస్థాయిలో నియమించాలని సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు అందజేసేలా కృషిచేయాలని కార్యకర్తలకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిగణలోకి తీసుకోకుండా లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కార్యోన్ముఖులు కావాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీల విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బలం ఒక స్థానం నుంచి 8 స్థానాలకు ఎదిగిందని గుర్తు చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పదిమంది ఎంపీలు గెలుపొందడమే లక్ష్యంగా శ్రేణులు కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. తెలంగాణలో ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు అవకాశం ఇచ్చారని, వచ్చే ఐదేళ్లలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర వహించిన బీజేపీని ప్రజలు ఆదరించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. అనంతరం వెంకటరమణారెడ్డితో పాటుగా సమావేశానికి నాయకులను కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు అనంతరావుకులకర్ణి, ఓదెల మాణిక్‌రావు, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారీ బద్దం మహిపాల్‌రెడ్డి, అందోలు అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు ఏ.వెంకటనర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు పండరి తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన కార్యకర్తలు

నేడు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

- బీఆర్ఎస్ కౌన్సిలర్ అశోక్‌గౌడ్‌కు దక్కే అవకాశం
- ప్రసుత ఇన్‌చార్జి చైర్మన్ నయీమొద్దీన్ క్యాంపునకు దూరం

నర్సాపూర్, జనవరి 28: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌ను సోమవారం ఓటింగు ద్వారా ఎన్నుకోవడానికి అధికారులు సిద్ధం చేశారు. మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉండగా ప్రస్తుతం 9 మంది బీఆర్ఎస్‌కు ఆరుగురు బీజేపీకి ఉన్నారు. బీఆర్ఎస్‌కు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఉండటంతో మెజార్టీ ఆ పార్టీకే ఉంది. అయితే చైర్మన్ పదవిని ఒకటో వార్డు కౌన్సిలరు అశోక్‌గౌడ్ మొదటినుంచి ఆశిస్తుండగా ప్రస్తుతం ఇన్‌చార్జి చైర్మన్‌గా ఉన్న వైస్ చైర్మన్ నయిమోద్దీన్ కూడా ప్రయత్నాలు చేశాడు. అయితే ముందుగా నిర్ణయించిన మేరకు స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు అశోక్‌గౌడ్ వైపే మొగ్గుచూపడంతో నయిమోద్దీన్ అసంతృప్తితో ఉన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఏడుగురు క్యాంపునకు వెళ్లగా నయిమోద్దీన్‌తో పాటు మరో మహిళ కౌన్సిలర్ వ్యక్తిగత పనులతో క్యాంపునకు వెళ్లలేదు. అయితే అసంతృప్తితో ఉన్న నయీమొద్దీన్‌తో సునీతారెడ్డి, మదన్‌రెడ్డి ఇద్దరు పలుమార్లు చర్చించారు. ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వయంగా నయీమొద్దీన్ ఇంటికి వెళ్లి చర్చించి అశోక్‌గౌడ్‌కు సహకరించాలని కోరినట్లు తెలిసింది. నేటి ఉదయం 11గంటలకు సమావేశం కోసం అధికారులు కూడా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక అధికారిగా తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డిని కలెక్టర్ నియమించారు.

గోదా రంగనాథ కల్యాణంలో మంత్రి దామోదర్

రంగనాథ ఆలయానికి రూ. 15 లక్షలు విరాళం, మల్లన్న గుడిలో నిర్మాణాలకు రూ. 2.50 కోట్ల నిధులు


అందోలు రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, జనవరి 28: గోదా రంగనాథ కల్యాణ మహోత్సవంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. అందోలు పట్టణంలోని చారిత్రక భూనీలా సమేత రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం అంగరంగ వైభవంగా గోదా కల్యాణం నిర్వహించారు. ఉత్సవాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంగనాథ స్వామివారి రథం పునరుద్ధరణకు రూ. 15 లక్షలు విరాళం ఇస్తున్నట్టు ప్రకటించారు. ఇందులో రూ. 2 లక్షలను ఆలయ బాధ్యులకు అందజేశారు. అనంతరం, జోగిపేట పట్టణంలో గొల్ల కుర్మల ఆరాధ్య దైవమైన మల్లన్న స్వామి సట్టి ఉత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. పట్టణంలోని మల్లన్నగుండి ప్రాంతంలో ఉన్న మల్లన్న ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. జోగిపేటలోని మల్లన్న ఆలయంలో ప్రహరీ, అంతరాలయం, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ. 2.50 కోట్ల నిధులను మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఆయనవెంట మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్యయాదవ్, కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, చిట్టిబాబు, రేఖా ప్రవీణ్, శంకర్, హరికృష్ణాగౌడ్, రంగ సురేశ్‌గుప్తా, మహేశ్‌యాదవ్, చందుయాదవ్, మానగోని మల్లేశం, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులన్నీ వెనక్కి

- కాంగ్రెస్ రాగానే విద్యుత్ కోతలు
- మెదక్ పార్లమెంట్ స్థానంలో విజయం మనదే
- బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



మెదక్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, హాజరైన కార్యకర్తలు

మెదక్, జనవరి 28: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులన్నీ ప్రస్తుతం వెనక్కి వెళ్లిపోతున్నాయని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించడానికి వచ్చిన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ఏడుపాయల వనదుర్గా ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు, మెదక్ పట్టణ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.50 కోట్ల నిధులు కేటాయించగా, ప్రస్తుతం ఆ నిధులన్నీ వెనక్కు వెళ్లాయని వాపోయారు. నిరంతర కరెంటు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రస్తుతం 14 గంటలకే విద్యుత్ సరఫరాను పరిమితం చేసిందని ఆరోపించారు. దళితబంధు లబ్ధిదారుల అకౌంట్లలో డబ్బులు జమచేస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఖాతాలను సీజ్ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ షోషల్ మీడియాలో రీల్స్ చేయాలని పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తా చాటాలని పిలుపునిచ్చారు. రైతు రుణమాఫీ చేయకుండా పార్లమెంటు ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్‌కు ఎవరు ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. గతంలో తాను మంజూరు చేసిన మెడికల్ కళాశాల తరగతులను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని సూచించారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా పార్లమెంటు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల్లో చెప్పిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యమించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి, ఎంపీపీలు జమునాజయరాంరెడ్డి, నారాయణరెడ్డి, కౌన్సిలర్లు మామిళ్ల ఆంజనేయులు, విశ్వం, నాయకులు గంగాధర్, లింగారెడ్డి, సిద్ధిరాములు పాల్గొన్నారు.

హరీశ్‌రావు.. ఏ మొహం పెట్టుకుని మెదక్‌లో తిరుగుతున్నావు

- పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు
- గత ఎమ్మెల్యే ఫొటోలకు పోజు లివ్వడం తప్ప అభివృద్ధి చేసింది లేదు
- హరీశ్‌రావుతోనే నియోజకవర్గానికి శని
- బీఆర్ఎస్ ఓటమితోనే ప్రజలకు శని వదిలింది
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు


చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న రోహిత్‌రావు

చిన్నశంకరంపేట, జనవరి 28: మాజీ మంత్రి హరీశ్‌రావు ఏ మొహం పెట్టుకుని మెదక్ నియోజకవర్గంలో తిరుగుతున్నాడని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు విమర్శించారు. చిన్నశంకరంపేట మండలకేంద్రంలో ఆదివారం ఆయన కల్యాణ మండపం, కమ్యూనిటీ హాళ్లు, టీమాందాపూర్, రుద్రారంలో నూతన గ్రామ పంచాయతీ భవనాలు, మాలుపల్లిలో అంబేడ్కర్ విగ్రహం, గవ్వలపల్లి తండాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ప్రజలు బీఆర్ఎస్ పాలనతో విసిగెత్తిపోయారని పేర్కొన్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అభివృద్ధిని పట్టించుకోకుండా ఫొటోలకు పోజులివ్వడానికే పరిమితమయ్యారని ఆరోపించారు. మెదక్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు పెత్తనం చెలాయించడమేమిటని ప్రశ్నించారు. ఆయన పెత్తనం సిద్దిపేటలోనే సాగించుకోవాలని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఓటమితో ప్రజలకు పట్టిన శని వదిలిందని ఎద్దేవా చేశారు. ఓటమిని జీర్ణించుకోలేకనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మెదక్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు, సునీల్ అగర్వాల్, సర్పంచ్‌లు రాజిరెడ్డి, మంగాదేవి యాదవరావు, లక్ష్మణ్, భిక్షపతిగౌడ్, లక్ష్మీశంకరయ్య, గోవింద్, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీమాన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణాప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు రామకిష్టయ్య, సత్యనారాయణ, రంగారావు, సిద్ధిరాములు, ఎడ్ల కిష్టయ్య, న్యాయవాది జనార్దన్‌రెడ్డి, ఉప సర్పంచ్ జీవన్, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గజ్వేల్ రైల్వే స్టేషన్‌కు 1,327 టన్నుల యూరియా

గజ్వేల్ రూరల్, జనవరి 28: తమిళనాడులోని కరేకల్ పోర్టు నుంచి ఆదివారం గూడ్స్ ట్రైన్ ద్వారా కోరమండల్ కంపెనీ గోదావరి యూరియా 21 బోగీలలో 1,330 టన్నులు గజ్వేల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నది. లారీల ద్వారా సిద్దిపేట జిల్లాలోని ఆయా మండలాలకు సంబంధించిన డీలర్లకు 1,107 టన్నులు, సంగారెడ్డి జిల్లాకు 120 టన్నులు, మెదక్ జిల్లాకు 100 టన్నుల యూరియా సరఫరా చేసేందుకు ఏర్పాట్లను మండల వ్యవసాయ అధికారి నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గజ్వేల్ రైల్వేస్టేషన్‌లో రేక్ పాయింట్ ఏర్పాటుతో జిల్లా ప్రజలతో పాటు సమీప జిల్లావాసులకు ఇతర రాష్ట్రాల నుంచి సరుకు రవాణా సౌకర్యం సులభతరమైంది.



గజ్వేల్ రైల్వే స్టేషన్ నుంచి లారీల్లో తరలిస్తున్న యూరియా



భక్తజనసందోహంతో కిక్కిరిసిన మల్లన్న ఆలయ రాజగోపుర పరిసరాలు, బోనంతో సిగమూగుతున్న శివసత్తులు



బోనం తీసుకువెళుతున్న భక్తురాలు

బోనమెత్తిన లష్కర్

● కొమురవెల్లి మల్లన్నకు లష్కర్ బోనాలు ● భక్తులతో పోటెత్తిన ఆలయం

చేర్యాల, జనవరి 28 : కొమరవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం లష్కర్ భక్తులతో పోటెత్తింది. మల్లన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చిన రెండో వారమైన ఆదివారం రోజున సికింద్రాబాద్‌కు చెందిన వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. ఇలవేల్పు దైవాన్ని దర్శించుకుని పులకించిపోయారు. ఆలయ ప్రాంగణంలో విక్రయించే కూరగాయలను కొనుగోలు చేసి నూతన మట్టికుండల్లో బోనం చేసి మల్లన్నకు నివేదించి పట్నాలు వేశారు. తమ కోర్కెలు నెరవేర్చమని ఆలయ ప్రాంగణంలోని గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఒడిబియ్యాలు పోసి తమను సల్లంగా కాపాడమని వేడుకున్నారు. తమకు సంతానం కలగాలని వేడుకుంటూ ఒళ్లబండ వద్ద వరంపట్టారు.

ఎల్లమ్మతల్లికి ఘనంగా బోనాలు

మల్లన్న సహోదరి ఎల్లమ్మ దేవతకు బోనం చేసి డప్పుచప్పుళ్ల హోరుతో, పూనకంతో శివమెత్తారు. గుట్టపైకి ఎక్కి బోనాన్ని సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. గంటల తరబడిగా పడిగాపులు కాయాల్సి వచ్చింది. పట్నాలు వేసిన భక్తులతో గంగిరేగుచెట్టు ప్రాంగణం కిటకిటలాడింది. ఈవో బాలాజీశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డిల పర్యవేక్షణలో కొమురవెల్లి ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



బోనం పూదించి పూజలు చేస్తున్న భక్తురాలు



మల్లన్న దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు, నజరుపట్నం వేస్తున్న భక్తులతో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం



వీరకోలతో సిగమూగుతున్న ఆచారవతుడు

ప్రసాదాలు, కండువాల కోసం
పునరుద్ధరణ కమిటీ సభ్యుల వాగ్వాదం

● అనవసరంగా ఇవ్వొద్దని చైర్మన్ ఆదేశం
● లష్కర్‌వారమూ భక్తులకు తప్పని తిప్పలు



వెనక దారి గుండా దర్శనం కోసం వెళ్లడానికి నిలబడిన భక్తులు

చేర్యాల, జనవరి 28 : కొమురవెల్లి మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీలో పలువురు సభ్యులు భక్తుల తిప్పలు పట్టించుకోకుండా తమ అనుయాయుల ఉచిత సేవలో తరిస్తున్నారు. క్యూలైన్లు, ఆలయ పరిసరాల్లో ఇబ్బందులు పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ బుకింగ్ కార్యాలయానికి పరిమితమై ఉచిత దర్శనాలు చేయిస్తూ, ఇష్టానుసారం శల్లాలు వినియోగిస్తూ, ప్రసాదాలు ఇప్పిస్తున్నారు. చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఎవరికి ఇష్టానుసారం ప్రసాదం ఇవ్వవద్దని సంబంధిత ఇన్‌చార్జికి చెప్పినప్పటికీ పలువురు వినకపోవడంతో వివాదానికి దారితీసింది. వెనకదారిగుండా దర్శనాలు నిలిపివేసినప్పటికీ లష్కర్‌వారం సందర్భంగా ఆదివారం ఓ సభ్యుడు తన అనుయాయులందరినీ తీసుకువెళ్లగా, మరో సభ్యుడు లడ్డూ ప్రసాదం ఇచ్చినా పులిహోర కూడా ఇవ్వాలని ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి స్పందించి అనవసరంగా ఎవరికీ ఇవ్వవద్దని ఇన్‌చార్జికి సూచించారు.

నిత్యం పప్పు.. వంకాయకూరే దిక్కు!

లష్కర్‌వారం సందర్భంగా నిత్యాన్నదానసత్రంలో భక్తులకు భోజనం నిలిపివేసి ఆలయ ఉద్యోగులు, ఇతర ప్రముఖులు, వలంటీర్లు, బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిని మాత్రమే అనుమతిస్తున్నారు. అయితే సత్రంలో కేవలం పప్పు, వంకాయ కూరను మాత్రమే రోజుల తరబడిగా పెడుతున్నారు. కాగా కొంతకాలంగా అన్నదానసత్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కల్యాణం రోజుతోపాటు శనివారం ఉడికీ ఉడకని భోజనం వడ్డించగా, పలువురు తినకుండా పారబోశారు.

భక్తుల దాహం దాహం

లష్కర్‌వారమూ మల్లన్న భక్తులకు ఏమాత్రం తిప్పలు తప్పలేదు. రద్దీ కారణంగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందక ఇబ్బందులుపడ్డారు. 24 గంటల పాటు తాగునీటి సరఫరా చేస్తున్నామని చెప్పిన మిషన్ భగీరథ అధికారులు ఆలయ పరిసరాలలోని నల్లాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాకపోవడంతో నీటిని కొని తెచ్చుకున్నారు. దర్శన క్యూలైన్ల ఆవరణలో భక్తులు దాహంతో ఇబ్బందిపడ్డారు. వాటర్ బాటిళ్లు కొనుక్కుని దాహార్తి తీర్చుకున్నారు. గతంలో ఆలయం తరఫున కనీసం వాటర్‌ప్యాకెట్లు అందించేవారు. కానీ ప్రస్తుతం ఎలాంటి ప్రత్యామ్నాయచర్యలు తీసుకోలేదు.

అభివృద్ధిని అడ్డుకోవడం లేదు..

చైర్మన్ అవినీతిపైనే పోరాటం

● తూప్రాన్ చౌరస్తాలో చర్చకు సిద్ధమా?
● వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు

తూప్రాన్, జనవరి 28: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ అవినీతిపై పోరాటం చేస్తున్నట్లు తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. తూప్రాన్ అభివృద్ధిని అడ్డుకోవడం లేదని, చైర్మన్ అవినీతిని అడ్డుకోడానికి ఒక్కటైనట్లు వారు పేర్కొన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లతో కలిసి వైస్ చైర్మన్ విలేకర్లతో మాట్లాడారు. తూప్రాన్‌లో అభివృద్ధి ఆగుతుందని కాదని, అవినీతి ఆగుతుందని చైర్మన్ భయపడుతున్నట్లు ఆరోపించారు. నాలుగేళ్లు సంపాదించుకున్నది సరిపోవడంలేదని ఇంకా దోచుకోడానికి ప్రయత్నాలు సాగిస్తున్నట్లు వివరించారు. చైర్మన్‌కు వంతపాడే వాళ్లకు అర్థం కావాలని, తూప్రాన్ చౌరస్తాలో చర్చిద్దామని సవాల్ విసిరారు. పది మంది కౌన్సిలర్లం వస్తామని, మీవెంట ఉన్న ఐదారుగురిని చర్చకు తీసుకురావాలన్నారు. బీఆర్‌ఎస్ పెద్దలు ఈ విషయాలను గ్రహించాలని కోరారు. చైర్మన్‌ను గద్దెదించే వరకు పట్టుదలగా ఉంటామని వారు స్పష్టం చేశారు.

కబ్జాలు చేసేందుకు కాంగ్రెస్‌లోకి రావొద్దు

● మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి


తూప్రాన్, జనవరి 28: కబ్జాలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో రావొద్దని, పేద ప్రజలకు సేవ చేసేందుకు రావాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. తూప్రాన్ మండలం నాగులపల్లిలో ఆదివారం సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కావేరిగారి భగవాన్‌రెడ్డి మరికొందరు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో నర్సారెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ తూప్రాన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎఫ్‌టీఎల్ భూములు, ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు ఆక్రమించారని ఆరోపించారు. అక్రమాలు, దుర్మార్గాలు తమ దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తామన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానంటూ ప్రజలకు, బాధితులకు సూచించారు. వారం పదిరోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లికి వెలుతున్నారని, తూప్రాన్ వద్ద భారీ ఎత్తున స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. నాగులపల్లి బీఆర్‌ఎస్ వార్డు సభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్ధిరాంరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వట్టూరులో సర్పంచు జానమ్మ మరికొందరు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి, నేత మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్‌యాదవ్, ఆకుల రవి, శశిభూషణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం

● సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులది : రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, జనవరి 28: దేశాభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కష్టపడే బీజేపీ రెండుసార్లు అధికారం చేపట్టి ముచ్చటగా.. హ్యాట్రిక్ విజయంతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమని దుబ్బాక బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. తపస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుడు రాగి రాములు స్వచ్ఛంద పదవీ విరమణ సన్మానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దాలన్నారు. మన సిద్ధంతాలు వేరైన చివరి లక్ష్యం దేశ భవిష్యత్తు మాత్రమే కావాలన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉద్యమ నేతలు పక్కకుపోయి, రాష్ట్ర ప్రజలను పట్టించుకోకుండా దోచుకోవడం.. దాచుకోవడం చేసిన కేసీఆర్‌కు గత ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. పార్టీ సిద్ధంతాలు, దేశాభివృద్ధికి పాటుపడుతున్న వారికి తప్పకుండా అవకాశం లభిస్తుందన్నారు. ఉపాధ్యాయ వృత్తికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి బీజేపీలో చేరిన రాగి రాములకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతరావు, నవాత్ సురేస్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర బాధ్యులు రామారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలతో తమ్ముడిని హత్య చేసిన అన్న



ఆంజనేయులు మృతదేహం

సదాశివపేట, జనవరి 28: భూ తగాదాలతో అన్న తన సొంత తమ్ముడిని దారుణంగా నరికి చంపిన ఘటన శనివారం అర్ధరాత్రి సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కంబాపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కంబాపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి ఆంజనేయులు (36), కుమ్మరి ప్రభాకర్ అన్నదమ్ములు. కొంతకాలంగా ఇద్దరి మధ్య భూ పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇద్దరి మధ్య శనివారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. దీంతో విచక్షణ కోల్పోయిన ప్రభాకర్ తమ్ముడు ఆంజనేయులును కళ్లల్లో కారం చల్లి గొడ్డలితో నరికి చంపాడు. ఈక్రమంలో అడ్డుగా వచ్చిన తండ్రి చంద్రయ్యపై సైతం దాడి చేశాడు. గ్రామస్థులు సమాచారం అందజేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన చంద్రయ్యను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

విభజనతోనే వికేంద్రీకరణ

● గజ్వేల్‌లో పౌరసేవలకు ఇబ్బందులు
● అధికారులపై పెరుగుతున్న ఒత్తిడి
● పోలీసులకు సమస్యగా మారిన గజ్వేల్
● గతంలోనే రూరల్ స్టేషన్‌కు ప్రతిపాదనలు
● అర్బన్, రూరల్ మండలాలను ఏర్పాటు చేస్తే చేరువకానున్న పాలన

గజ్వేల్, జనవరి 28 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలు, డివిజన్లు, మండలాలను పునర్విభజన చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ తన సొంత నియోజకవర్గంలో మండల కేంద్రం విభజనపై మాత్రం చొరవ చూపకపోవడంతో సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. చివరి నిమిషంలో కుకునూర్‌పల్లిని మండలంగా ఏర్పాటు చేసినా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గజ్వేల్ మండలంలోని కొడకండ్ల గ్రామాన్ని కుకునూర్‌పల్లిలో కలపలేదు. ఇక 2016లో జిల్లాల పునర్విభజనలో భాగంగా దౌల్తాబాద్ మండలంలో ఉన్న ఆరేపల్లి(ఎస్.బీ)ని గజ్వేల్ మండలంలో కలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీతో పాటు 26 గ్రామాల మండలం ఏర్పాటైంది. అదనంగా తొగుట మండలంలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు గజ్వేల్ పట్టణంలో చేరడంతో పట్టణ జనాభా భారీగా పెరిగిపోయింది. వారికి పౌరసేవలు అందించడంలో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెవెన్యూ అధికారులపై పెరిగిన ఒత్తిడి

గజ్వేల్ పట్టణం విస్తరించడం, భూముల విలువ అమాంతం పెరిగిపోవడం, వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీవ్రంగా పెరిగింది. పునరావాస కాలనీ పనులను చూసేందుకు ఇద్దరు అధికారులు పూర్తిస్థాయిలో నిమగ్నమవుతుండడంతో ఇటు మండలం, ఇటు పట్టణ ప్రజలకు అందాల్సిన ఆయా రకాల ధ్రువపత్రాలను అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక ప్రభుత్వ భూములను కాపాడడం కత్తిమీద సాములా మారింది. ఇప్పటికే అనేక చోట్ల ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతానికి రెవెన్యూ అధికారులకు అండగా ఉన్న వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేసి ఇతరశాఖల్లో సర్దుబాటు చేస్తే ప్రభుత్వ భూములను కాపాడడం కష్టతరమేనని అధికారులు వాపోతున్నారు. పట్టణంతో పాటు మండలంలోని 26గ్రామాల ప్రజలకు అందాల్సిన పౌరసేవలు సరైన సమయానికి అందడం లేదు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సరైన స్థాయిలో సిబ్బంది లేకపోవడం సమస్యగా మారింది. ప్రత్యేక రెవెన్యూ మండలంగా విభజిస్తేనే సమస్యకు పరిష్కారం లభ్యమవుతుందని అధికారుల ద్వారా వినవస్తుంది.



పోలీసులకు ఇబ్బందులు

గజ్వేల్ పట్టణం రోజురోజుకూ విస్తరిస్తుండడం, కొత్తగా బైపాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు రావడం, త్వరలోనే రైల్వేలైన్ అందుబాటులోకి వస్తుండడం, మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు ఇలా భారీగా జనాభా పెరిగిపోవడంతో పోలీసులకు పనిభారం ఎక్కువైంది. పట్టణంతో పాటు మండలాన్ని పర్యవేక్షించడం ఇబ్బందిగా మారింది. గజ్వేల్ రూరల్, గజ్వేల్ అర్బన్‌గా విభజిస్తేనే సమస్య పరిష్కారం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు వచ్చి చేరడం, సిబ్బంది, అధికారుల నియామకం జరగకపోవడంతో ఉన్న సిబ్బందే కష్టపడాల్సి వస్తుంది. గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు సీఐలు ఉండగా, నలుగురు ఎస్‌ఐలకు ముగ్గురు, ఆరుగురు ఏఎస్‌ఐలకు నలుగురు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 70మంది కానిస్టేబుళ్లకు 50మందే ఉన్నారు. ఉన్న వారిలో పలువరు డిప్యూటేషన్ ఇతర వింగ్‌లలో చేస్తుండడంతో కొందరు మాత్రమే పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక గతంలో 2020కి ముందు ఏడాదిలో 400కేసులు నమోదైతే ప్రస్తుతం ఈసంఖ్య 600లకు పెరిగింది. రోజువారీ ఫిర్యాదుల సంఖ్య గతంలో మూడు నాలుగు ఉంటే ప్రస్తుతం ఈసంఖ్య పది దాటింది. దీంతో సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2021-22 సంవత్సరంలోనే గజ్వేల్ రూరల్ స్టేషన్‌కు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కానీ ఈ ప్రతిపాదనలపై ఇప్పటివరకు ఎలాంటి ముందడుగు పడలేదు. గజ్వేల్ రూరల్ స్టేషన్, జగదేవ్‌పూర్, కుకునూర్‌పల్లిలను కలుపుతూ గజ్వేల్ రూరల్ సర్కిల్, గజ్వేల్ పట్టణాన్ని ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా ప్రత్యేకంగా టౌన్‌కు పరిమితం చేయడంతో పాటు తొగుట సర్కిల్ పరిధిలో బేగంపేట, రాయపోల్, తొగుట, దౌల్తాబాద్‌లను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలు అక్కడికే పరిమితమయ్యాయి. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సర్కిళ్ల పునర్విభజన, పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెరిగిన ట్రాఫిక్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన తొగుట మండలంలోని రాంపూర్, లక్ష్మాపూర్, వేములఘాట్, బ్రాహ్మణబంజేరుపల్లి, పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్, కొండపాక మండలంలోని సింగారం, ఎర్రవల్లి గ్రామాలు వచ్చి చేరాయి. ఇక కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాలైన బైలంపూర్, మామిడ్యాల, తానేదార్‌పల్లి గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు కొండపోచమ్మ సాగర్ పునరావాస కాలనీకి వెళ్లకుండా పిల్లల చదువు, గజ్వేల్‌లో వ్యాపారం, ఉద్యోగాలు ఉన్న పలువురు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో గజ్వేల్ పట్టణంలో జనాభా భారీగా పెరిగింది. గతంలో 40వేల జనాభా ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 80 నుంచి 90 వేలకు చేరింది. దీంతో మండల పునర్విభజనతో పాటు పోలీసు శాఖ, ఇతర శాఖలను పునర్వ్యవస్థీకరించాలని పలువురు కోరుతున్నారు.

విభజనకు అడ్డంకిగా కొందరు

గత ప్రభుత్వంలో అన్ని తామై వ్యవహరించినట్లుగా భావించిన పలువురు నాయకులు మండల విభజనకు అడ్డంకిగా మారారు. గజ్వేల్ మండలంలోనే ఉంటామని, గజ్వేల్ అనే పేరు ఉండాలన్న లక్ష్యంతో పలువురు మండల విభజనను వ్యతిరేకించారు. తమ పరిధిలోని గ్రామాలను విడదీయవద్దని పలువురు సర్పంచ్‌లు, స్థానికంగా ప్రభావితం చేయగలిగే నాయకులకు హుకుం జారీ చేయడంతోనే విభజనకు గ్రీన్‌సిగ్నల్ పడలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరగుతుందని, మండలాన్ని విభజన చేస్తే అటు ప్రజలకు పౌరసేవలు, ఇటు అధికారులకు పని ఒత్తిడి తగ్గే అవకాశాలు ఉన్నాయి.

భక్తిపారవశ్యం

శివ్వంపేట, జనవరి 28: మండలంలోని చిన్నగొట్టిముక్లలో ఎనిమిదేళ్ల తర్వాత మూడురోజుల పాటు నిర్వహిస్తున్న గ్రామదేవతల ఉత్సవాలు ఆదివారం ఘనంగా కొనసాగాయి. లింగమయ్యకు, దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, బోనాల ఊరేగింపును నిర్వహించారు. ఆకట్టుకుంది. ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి, రవీందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డితో పాటు ఎంపీపీ హరికృష్ణ, జడ్పీటీసీ మహేష్‌గుప్తా, సర్పంచ్ బాలమణినరేందర్ తదితరులు పాల్గొన్నారు. సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఒడిబియ్యం, బోనాలు సమర్పించారు.

గంగయ్యపల్లిలో ఘనంగా ఉర్సు ఉత్సవాలు

శివ్వంపేట మండలంలోపి గంగయ్యపల్లిలోని ఉర్సు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా వేదాంతహారతి, ఖురాన్, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా భక్తులు హాజరయ్యారు. నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐలాపూర్‌లో ఘనంగా రేణుక ఎల్లమ్మ జాతర

పటాన్‌చెరు, జనవరి 28: అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో రేణుక ఎల్లమ్మ జాతరను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని భ్రమరాంబామల్లికార్జునస్వామి, రేణుక ఎల్లమ్మల ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. అమ్మవారికి గ్రామ మహిళలు బోనాలను సమర్పించారు. జాతర పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ ఈర్లదేవానంద్, సర్పంచ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మ బ్రహ్మోత్సవాలు

రామాయంపేట, జనవరి 28 : ఆలయ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని చిత్తారమ్మ బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు దర్శించుకున్నారు. ఆమె వెంట నాయకులు సరాపు యాదగిరి, చంద్రం, పుట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్ నాగరాజు ఉన్నారు.



చిన్నగొట్టిముక్ల గ్రామదేవతల ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అయోధ్య గుడి అద్భుతంగా ఉంది

రేగోడు జనవరి 28: అయోధ్యలోని రాముడి మందిరం అద్భుతంగా నిర్మించారని నారాయణఖేడ్ మండలం కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ అన్నారు. ఆదివారం రేగోడు మండలంలోని మర్పల్లి గ్రామంలో పునర్నిర్మాణం చేపడుతున్న హనుమాన్ మందిరాన్ని ఆయన పరిశీలించారు. నిర్మాణంకు పలు సూచనలు చేశారు.

నల్లపోచమ్మ ఆలయ ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నర్సాపూర్, జనవరి 28: నర్సాపూర్ పట్టణంలోని ఆరాధ్యదైవం నల్లపోచమ్మ ఆలయ ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 31వ తేదీ నుంచి మూడురోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎంపీపీ రమణారావు, పీఏసీఎస్ చైర్మన్ రాజయాదవ్, ప్రతినిధులు దండుదశరథ్, జగదీష్, శ్రీశైలంయాదవ్, కొండకుమార్, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గుమ్మడిదల విద్యార్థి ఎగ్జిబిట్ ప్రదర్శన

సంగారెడ్డి అర్బన్, జనవరి 28 : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్‌కె. ఫైజాన్ రూపొందించిన ఓ సైన్స్ ప్రయోగాన్ని జాతీయ స్థాయిలో ప్రదర్శించే అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 29, 30 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న ఇనిషియేటివ్ ఫర్ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ ఎస్‌టీఈఎం(ఐఆర్ఐఎస్) కార్యక్రమంలో వినూత్నంగా తయారు చేసిన 'క్రాప్ ప్రొటెక్టర్'పై చేసిన అభివృద్ధి ప్రయోగాన్ని ప్రదర్శించేందుకు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా వంద మంది రూపొందించిన ఆవిష్కరణలు ప్రదర్శనకు ఎంపిక కాగా, అందులో గుమ్మడిదల జడ్పీహెచ్ఎస్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఫైజాన్ రూపొందించిన ప్రయోగం ఉండడం విశేషం. ఈ ఆవిష్కరణకు గుర్తింపు దక్కితే అమెరికాలో జరిగే ఎగ్జిబిట్ల ప్రదర్శనకు ఎంపిక చేస్తారు.



ఫైజాన్ రూపొందించిన క్రాప్ ప్రొటెక్టర్

పొలంలో నాన్న పడే కష్టం చూడలేక..

తన తండ్రి పొలంలో పడుతున్న కష్టాన్ని చూడలేక తాను 'క్రాప్ ప్రొటెక్టర్'తో పరిష్కారం చూపాలని దీనిని రూపొందించినట్లు విద్యార్థి ఫైజాన్ తెలిపారు. చిన్న వాటర్ బాటిల్‌తో బెల్ మోగించడం ద్వారా పక్షులను పారదోలేలా చేసిన ప్రయోగం జాతీయ స్థాయిలో ఎంపికైందని పేర్కొన్నారు. రైతు పొలంలో లేకున్నా పక్షులు, జంతువులు వచ్చినప్పుడు దానంతట అదే శబ్దం చేస్తుందని, అడవి పందులు, కోతులు, పక్షులు పొలంలోకి వచ్చే అవకాశం ఉండదని వివరించారు. సోలార్‌తో ఇది పనిచేస్తుందని, ఎలాంటి హాని ఉండదని తెలిపారు. గైడ్ టీచర్ శోభారాణి [illegible] చిల్డ్రన్స్ కాంగ్రెస్, భువనేశ్వర్‌లో జరిగిన జీ-20 సైన్స్ ఫెయిర్, గౌహతిలోని బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించారు.

ప్రమాదకరంగా మలుపులు

● సూచిక బోర్డుల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం ● తరచూ ప్రమాదాలతో భయాందోళనలో వాహనదారులు

వెల్దుర్తి, జనవరి 28 : ప్రధాన రహదారులపై మలుపుల ప్రమాదకరంగా మారాయి. సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ హల్దీవాగు బ్రిడ్జ్, ధర్మారం గేటు, దామరంచ, మన్నెవారి జలాల్‌పూర్ గ్రామాల వద్ద మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. గతేడాది జూన్‌లో దామరంచ మలుపు వద్ద శివ్వంపేట గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ప్రమాదానికి గురయ్యాడు. ధర్మారం గేటు మూల మలుపు వద్ద డిసెంబరులో జరిగిన ప్రమాదంలో శివ్వంపేట మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే మెదక్ నుంచి మంగళపర్తికి ట్రాక్టర్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి హల్దీవాగులో పడి మృతి చెందాడు. ఇలా మూలమలపుల వద్ద నిత్యం ఏదోఒక ప్రమాదం చోటుచేసుకుంటూనే ఉన్నది. ప్రాణాలు కోల్పోతున్న అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతున్నారు.



జలాల్‌పూర్ శివారులో ప్రమాదకరంగా వెల్దుర్తి- నర్సాపూర్ ప్రధాన రోడ్డు

సమస్యల కేంద్రంగా సిద్ధాపూర్ చౌరస్తా



సిద్ధాపూర్ కాలనీకి వెళ్లే రహదారి

సదాశివపేట, జనవరి 28 : సదాశివపేట పట్టణంలో 65వ జాతీయరహదారిని దాటుతూ సిద్ధాపూర్ కాలనీకి వెళ్లే సిద్ధాపూర్ చౌరస్తా అనేక సమస్యలకు కేంద్రంగా మారింది. ఓపక్క జాతీయ రహదారిపై డివైడర్-యూటర్న్ ఏర్పాటు, సిద్ధాపూర్ డబుల్ రోడ్డు నిర్మాణం.. మరో పక్క జాతీయరహదారికి ఇరువైపులా మద్యం, మాంసం దుకాణాలు, వాహనాల పార్కింగ్‌తో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. సమీప హోటల్స్, కిరాణ కొట్టుల్లో ఏర్పాటు చేసుకున్న బెల్టుషాపులు అసాంఘిక శక్తులకు, మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రతీరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సిద్ధాపూర్ చౌరస్తాలో కూలీలు, భవన నిర్మాణాల మేస్త్రీలు, కార్మికులు పెద్దసంఖ్యలో రహదారికి అడ్డంగా ఒకేచోట గుంపులుగా నిలబడడంతో రద్దీగా మారుతున్నది. ఈ చౌరస్తా వద్దనే చిరువ్యాపారులు అమ్మకాలు కొనసాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సిద్ధాపూర్ రోడ్డును రూ.6.50కోట్లతో డబుల్‌రోడ్డుగా తీర్చిదిద్దే పనులను కొద్ది రోజుల క్రితం కాంట్రాక్టర్ అసంపూర్తిగా నిలిపివేశారు. దీంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల భారీన పడుతున్నారు. ఈరోడ్డుతో పాటు 65వ నెంబరు జాతీయరహదారి అనుకుని భారీ మురుగు కాలువ(నాలా) ప్రవహిస్తుండడంతో పలువురు ప్రమాదవశాత్తు అందులో పడుతున్నారు. ఈ రోడ్డుపై పగటిపూట సైతం ప్రయాణం సాగించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు కాలనీలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు మున్సిపల్ పరిధిలోనే ఉన్నప్పటికీ సిద్ధాపూర్ రహదారి- చౌరస్తాలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దడం లేదు. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ కూడలిలో బెల్టుషాపులు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారమయ్యేలా ఉన్నది.

అర్హులైన వారికే సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 28: పార్టీలకు అతీతంగా అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు అందించడానికి కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం రాత్రి తన స్వగృహ ఆవరణలో మండలంలోని తొమ్మిది మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తూ ఆపిన చెక్కులను ప్రజల సంక్షేమం దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అందించడం జరుగుతుందన్నారు. ప్రజాసంక్షేమానికి కట్టుబడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటిని అమలులోకి తీసుకురాగా, ఫిబ్రవరిలో మరో రెండింటిని అమలులోకి తీసుకురాబోతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దారం శంకర్, మాజీ ఎంపీటీసీ ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కాంగ్రెస్‌లో చేరికలు

నారాయణఖేడ్, జనవరి 28: మండల పరిధిలోని హంత్రాన.జి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోదరుడు మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తాము కాంగ్రెస్‌లో చేరినట్లు చేరిన వారు తెలిపారు.

బీఆర్ఎస్ పథకాలను రద్దు చేస్తున్న కాంగ్రెస్

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌడిపల్లి, జనవరి 28 : బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ పార్టీ రద్దు చేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాయిలపూర్ సర్పంచ్ కుర్మ శేఖర్‌యాదవ్ నిర్మాణం చేసిన గ్రామ పంచాయతీ భవనం, జాజి తండాలో పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో నర్సాపూర్ నియోజకవర్గంలో 93 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. మాజీ శాసన సభ్యులు మదన్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయలు శాశ్వతం కాదని, ప్రజల తీర్పును శిరసావహిస్తామన్నారు. త్వరలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజు నాయక్, జడ్పీటీసీ కవిత అమర్ సింగ్, రాయిలపూర్ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు స్వప్న కిషోర్, ప్రవీణ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామగౌడ్ ఉన్నారు.



రాయిలపూర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

బోరు మోటారు ప్రారంభించిన ఎమ్మెల్యే

నర్సాపూర్, జనవరి 28: నర్సాపూర్ పట్టణంలోని 6వ వార్డులో ఉన్న మదర్సా భవనంలో కొత్తగా మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేసిన బోరుమోటారును ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ బోరుమోటారు వల్ల నీటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మెదక్ అర్బన్, జనవరి 28: ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండల పరిధిలోని శానాయిపల్లి గ్రామానికి చెందిన బాల్యాల మహేష్(24) ఆటోనగర్‌లో బైక్ షాపు ఏర్పాటు చేసుకుని మెకానిక్‌గా జీవిస్తున్నాడు. కొన్నాళ్లుగా ఆర్థిక పరిస్థితుల బాగాలేవని పలువురితో చెప్పుకున్నాడు. ఈ క్రమంలో మనస్తాపంతో తెల్లవారుజామున తన షాపులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహేష్ తండ్రి రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేష్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నారాయణఖేడ్, జనవరి 28: ఖేడ్ పరిధిలోని రాయిపల్లి రోడ్డులో జూకల్ శివారులో అంత్వార్ గ్రామానికి చెందిన పుప్పాల మాణయ్య వ్యవసాయ భూమిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి ఆదివారం తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చన్నారు. మృతదేహాన్ని చూసి గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

మంజీరాలో..

పాపన్నపేట జనవరి 28: మండల పరిధిలోని పొడ్చన్‌పల్లి గ్రామ శివారు మంజీరానదిలో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం లభ్యమైనట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పొడ్చన్‌పల్లి శివారులో ఉన్న మంజీరానది ఒడ్డునా నీటిలో తేలియాడుతున్న సుమారు 60 - 65 ఏళ్ల వయసున్న ఓ వృద్ధుడి మృతదేహాన్ని అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. మృతదేహం ఒంటిపై లేత పసుపు రంగు చొక్కా, తెలుపు రంగు ధోతీ ఉంది. మూడు రోజుల క్రితం చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనాకొచ్చారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నగదు కాజేసిన ముగ్గురి అరెస్ట్

రామాయంపేట, జనవరి 28 : రామాయంపేటలో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ఓ వ్యక్తి జేబులోంచి నగదు కాజేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. బాగిర్తిపల్లికి చెందిన నర్సింలు రామాయంపేటలో బస్సు ఎక్కుతుండగా జేబులోని 50వేలను కాజేశారు. ఈ మేరకు బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ ఫుటేజ్ ఆధారంగా పలు వివరాలు సేకరించారు. ఓ కారులో నిందితులు రామాయంపేట మీదుగా వెళ్తుండగా తనిఖీలో భాగంగా వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, తామే డబ్బు కొట్టేసినట్టు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఆ నగదును స్వాధీన చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. .

సరస్వతి శిశుమందిర్‌లో ముగిసిన ఖేల్ కూద్

సంగారెడ్డి రూరల్, జనవరి 28 : సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ సమీపంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం సంగారెడ్డి విభాగ్ స్థాయి ఖేల్ కూద్ క్రీడలు అట్టహాసంగా ముగిశాయి. ఈ క్రీడలకు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదవుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని అన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విభాగ్ అధ్యక్షుడు అంజనేయులు, ఎంఈవో వెంకననర్సింహాగౌడ్, కార్యదర్శి వీరారెడ్డి, శివరాములు, కిష్టయ్య, పాఠశాల ప్రధానాచార్యులు నర్సింహ్మగౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కుస్తీ పోటీలు

రాయికోడ్, జనవరి 28: రాయికోడ్ మండల పరిధిలోని కర్చల్ గ్రామంలో పానూరి ఇమామ్‌హజ్రత్ దర్గా ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఆఖరి రెండు కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి 5 తులాల వెండి, రెండో బహుమతి 4.5 తులాల వెండి కడియాలను ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఖేడ్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నారాయణఖేడ్, జనవరి 28: నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో ఈ నెల 29న సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగేందర్‌కుమార్ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. ఖేడ్‌లోని 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని మండలాల పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పాపన్నపేట మండలం మిన్పూర్ 220 కేవీ సబ్ స్టేషన్ నుంచే సరఫరా ఉండదని, అందువల్ల వినియోగదారులు సహకరించాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

జిన్నారం. జనవరి 28: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వివిద సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్ వాల్ పోస్టర్‌ను సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం బొల్లారం మున్సిపాలిటీలో సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజయ్య, నాయకులు సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, సత్తయ్యలు దేశవ్యాప్త సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక మానాక్సియా పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఐదేళ్ల క్రితం పరిశ్రమ లాకౌట్ ప్రకటించగా వారికి ఎలాంటి సెటిల్మెంట్ చేయకపోవటం తగదని అన్నారు.

వెంకట్‌రాజ్‌కు ఆత్మీయ సన్మానం

సంగారెడ్డి రూరల్, జనవరి 28 : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న విజిలెన్స్ శాఖ ఎస్ఐ వెంకట్‌రాజ్‌ను ఆదివారం సంగారెడ్డిలో ఆయన మిత్రబృందం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సారా ప్రభాకర్ గౌడ్, అల్లాదుర్గ్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతికి కరాటేలో బ్లాక్‌బెల్టు

నర్సాపూర్, జనవరి 28: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీలో నర్సాపూర్ మండలం రుస్తుంపేటకు చెందిన ప్రసన్నలక్ష్మి ప్రతిభ చాటి బ్లాకు బెల్టు సాధించింది. ప్రసన్నలక్ష్మి పెద్దచింతకుంటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతోంది. బ్లాకుబెల్టు సాధించిన యువతిని సినీహీరో సుమన్ ప్రత్యేకంగా అభినందించి ఆశీర్వదించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చిన్నశంకరంపేట, జనవరి 28 : ఈనెల 29న చిన్నశంకరంపేట మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు

గుమ్మడిదల వర్తక సంఘం అధ్యక్షుడిగా ఆకుల సత్యనారాయణ



గుమ్మడిదల వర్త సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన ఆకుల సత్యనారాయణను సన్మానిస్తున్న వర్తకులు

గుమ్మడిదల, జనవరి 28 : గుమ్మడిదల మండల కేంద్రంలో వర్తక సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. వర్తక సంఘం భవనంలో అధ్యక్ష ఎన్నిక పోటాపోటీగా కొనసాగింది. ఇప్పటివరకు వర్తక సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా కొనసాగగా, ఈసారి అధ్యక్ష పదవికి డిమాండ్ బాగా పెరగడంతో పలువురు ఆశావహులు వర్తక సంఘం అధ్యక్ష పదవికి పోటీపడ్డారు. ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నికలు జరగగా 87 ఓట్ల తేడాతో ఆకుల సత్యనారాయణ రెండోసారి విజయం సాధించారు. ఆయనను వర్తకులు, ప్రజాప్రతినిధులు పలువురు సన్మానించారు. తనపై ఎంతో నమ్మకంతో మరోసారి అవకాశం కల్పించిన వర్తకులకు ప్రజలకు ఆకుల సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. గుమ్మడిదల వర్తక సంఘం అభివృద్ధి కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్ గౌడ్, సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ మొగులయ్య, దేవాలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు పోచుగారి మోహన్ రెడ్డి రైతులు పలువురు పాల్గొన్నారు.

భగవన్నామ స్మరణతోనే మానసిక ప్రశాంతత

● మాధవానంద సరస్వతీ స్వామి

కంది, జనవరి 28 : ప్రతీ ఒక్కరికీ భగన్నామస్మరణతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాధవానంద సరస్వతీ అన్నారు. కంది మండలం చిమ్నాపూర్ గ్రామంలో ఆదివారం జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో యశస్సు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐక్యత, చైతన్యం, సమానత్వం నింపడానికి మాధవానంద సరస్వతీ స్వామి గ్రామంలోని వీధుల్లో పర్యటించారు. చిన్నారులతో ఉట్లు కొట్టించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి, అనుగ్రహభాషాణం చేశారు. మనుషులంతా ఒక్కటేనని, అందరూ ఒకరికొకరు గౌరవమర్యాదలు ఇచ్చిపుచ్చుకోవలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామారావు దేశ్‌పాండే, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ కులకర్ణి, శేషాద్రి కుమార్, రాధాబాయి, ప్రధాన కార్యదర్శి వినోద్ పటేల్, కోశాధికారి కిషన్‌రావు బక్షి, సంగారెడ్డి మండల సంఘం అధ్యక్షుడు కే.రవిశంకర్, ప్రధాన కార్యదర్శి సురేష్‌జోషి, కోశాధికారి వసంత్‌రావు, మహిళా సంఘం అధ్యక్షురాలు మాధవి, ప్రధాన కార్యదర్శి శిరీష కులకర్ణి, ఆత్మకమిటీ చైర్మన్ వడ్డెపల్లి కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మహిళల కోలాటాన్ని తిలకిస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

ఈటలను కలిసిన పులిమామిడి రాజు



ఈటల రాజేందర్‌తో పులిమామిడిరాజు

సదాశివపేట, జనవరి 28: సంగారెడ్డి నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి పులిమామిడి రాజు ఆదివారం తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లో మాజీమంత్రి ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల పవన్, జిల్లా కార్యదర్శి రాకేష్ ఠాకూర్, బీజేపీ నాయకులు తాల్లెల్ల రమేష్ నల్ల సాయికిరణ్, పీఎమ్మార్ యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలే

● ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి

అల్లాదుర్గం, జనవరి 28 : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ హెచ్చరించారు.

అతివేగమే ప్రమాదాలకు కారణం

● ఎస్ఐ రాజయ్య

రేగోడు జనవరి 28: వాహనాలను అతివేగంగా నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని రేగోడు ఎస్ఐ రాజయ్య ఆదివారం తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని పత్రాలు వెంటా ఉంచుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సోలక్‌పల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జిన్నారం, జనవరి 28 : మండలంలోని సోలక్‌పల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం సోలక్‌పల్లి రైతువేదికలో జిన్నారం ప్రభుత్వ పాఠశాలలో 1993-94 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సుమారు 70 మంది, ముగ్గురు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడు దశాబ్దాల తమ స్నేహబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో స్నేహితులు తమ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు.

ఏడుపాయలకు రూ.100 కోట్ల నిధులిచ్చింది అబద్ధం

● కాంగ్రెస్ నేతల మండిపాటు

మెదక్, జనవరి 28 : ఏడుపాయల ఆలయ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు కేటాయించిందని, ఆ నిధులేమో ప్రస్తుతం వెనక్కి మళ్లాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అసత్యపు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొండన్ సావిత్రి సురేందర్ గౌడ్, న్యాయవాది జీవన్, ఏఎంసీ మాజీ చైర్మన్ నరేందర్ విలేకర్లతో మాట్లాడారు. మెదక్ పట్టణ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు, ఏడుపాయల దేవస్థానానికి రూ. 100 కోట్లు మంజూరు కాలేదని వివరించారు.

కాంగ్రెస్ స్పీడును తట్టుకోలేరు

● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



పద్మశాలి సంఘ సమ్మేళనంలో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

రామాయంపేట, జనవరి 28 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో దూసుకుపోతోందని, అదే సమయంలో అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు వ్యాఖ్యానించారు. రామాయంపేటలోని పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఆదివారం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం మూడు నెలల వ్యవధిలోనే ఇచ్చిన హామీలను చాలా వరకు నెరవేర్చిందన్నారు. ప్రభుత్వంలో అనుభవం కలిగిన కేబినెట్ మంత్రులు ఉండటం వల్ల రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి జరుగుతోందన్నారు. అనంతరం స్థానిక చిత్తారమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఆయన వెంట టీపీసీసీ ప్రతినిధి సుప్రభాత్‌రావు, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, డాకి స్వామి, అల్లాడి వెంకటి, శ్రీధర్‌రెడ్డి లు ఉన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

నిజాంపేట, జనవరి 28 : గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపించిన మార్గం అనుసరణీయమని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మండలంలోని చౌకత్‌పల్లి తండాలో ఆదివారం గిరిజనుల ఆరాధ్య దైవమైన జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవానికి హాజరయ్యారు.

'అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోండి '

సంగారెడ్డి రూరల్, జనవరి 28 : అక్రమాలకు పాల్పడుతున్న మున్సిపల్ అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబుపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోనే గ్రేడ్ వన్ మున్సిపాలిటీ పేరున్న సంగారెడ్డి మున్సిపాలిటీలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించి వారి స్థానంలో రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు డబ్బు తీసుకుని నియమించారని ఆరోపించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై సీఎంకు లేఖ రాయడం జరిగిందన్నారు.

కూతురు వివాహ వేడుకకు స్థలాన్ని పరిశీలించిన మంత్రి

పుల్‌కల్, జనవరి 28: తన కూతురు త్రిష వివాహ విందు వేడుక కోసం అవసరమైన స్థలాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ఆదివారం పరిశీలించారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో సింగూరు చౌరస్తా, సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి పక్కన దాదాపు 40 ఎకరాల వ్యవసాయ భూమిని ఎంపిక చేశారు. మార్చి 2వ తేదీన వివాహ విందు వేడుక జరుగనుంది.

మద్యం దుకాణంపై పోలీసుల దాడి

అల్లాదుర్గం, జనవరి 28 : ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణం (బెల్టుషాప్)పై ఆదివారం రాత్రి స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి భారీగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఘటన అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. చిల్వర్ గ్రామానికి చెందిన శివ ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. నమ్మదగిన సమాచారంతో దుకాణంపై దాడి చేసి నిల్వ ఉన్న 126 బీరు బాటిళ్లు, 97 ఇంపీరియల్ బ్లూ క్వార్టర్లు, 27 రాయల్ స్టగ్ క్వార్టర్లు, 61 డక్కన్ బ్లూ, 97 డబుల్ కిక్ క్వార్టర్లు, 93 ఆఫీసర్ చాయిస్‌క్వార్టర్లు, 8 పీఎం ఆఫ్ బాటిళ్లు పట్టుబడినట్లు ఆయన వివరించారు. వీటి విలువ రూ. 85 వేల వరకు ఉంటుంది.

ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో అధికారులు విఫలం

● బజాజ్ ఇంజనీరింగ్ అధినేత అలీఅక్బర్

జహీరాబాద్, జనవరి 28: ప్రభుత్వ భూములను రక్షించడంలో అధికారులు విఫలమయ్యారని బజాజ్ ఇంజనీరింగ్ సంస్థ అధినేత అలీఅక్బర్ ఆరోపించారు. ఆదివారం ఆయన జహీరాబాద్ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జహీరాబాద్, కోహీర్ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను అక్రమార్కులు కబ్జా చేసున్నప్పటికీ అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో షకిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విలీనంపై దృష్టి సారించండి

● టీజేఎంయూ రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి

సంగారెడ్డి అర్బన్, జనవరి 28 : టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల్లో గెలవడం కోసం మాజీ సీఎం కేసీఆర్ ఆర్టీసీ విలీనాన్ని ఆర్భాటంగా ప్రకటించి ఆర్టీసీ విలీన ప్రక్రియను గాలికొదిలేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే కార్మికులకు శుభవార్త చెప్పి రాష్ట్రంలోని 43 వేల మంది కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. అంతే కాకుండా పీఆర్సీ, బాండ్ డబ్బులు, సీసీఎస్, పీఎఫ్ డబ్బులను తక్షణమే విడుదల చేసి కార్మికులకు ఊరట కల్పించాలని పల్లె కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు.

విగ్రాం రామాగౌడ్ సేవలు చిరస్మరణీయం

● పెద్దశంకరంపేట ఎంపీపీ జంగం శ్రీనివాస్



నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట, జనవరి 28: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీత పారిశ్రామిక సంస్థ మాజీ చైర్మన్ దివంగత విగ్రాం రామాగౌడ్ చేసిన సేవలు చిరస్మరణీయమని పెద్దశంకరంపేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచు అలుగుల సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు విగ్రాం వేణుగోపాల్‌గౌడ్‌లు అన్నారు. విగ్రాం రామాగౌడ్ రెండో వర్ధంతి సందర్భంగా ఆదివారం పెద్దశంకరంపేటలో ఆయన విగ్రహానికి ఎంపీపీ, సర్పంచు, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, దాదిగారి గంగాధర్, సురేష్‌గౌడ్, బక్కారెడ్డి, సాయిరెడ్డి, అనిల్, సూర్యప్రకాష్, రజనీకాంత్, రాజు గౌడ్, రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ మతోన్మాద విధానాలను వ్యతిరేకిద్దాం

నారాయణఖేడ్, జనవరి 28: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతోపాటు కార్పొరేట్ మతోన్మాత విధానాలకు పాల్పడుతున్న వారిని ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం అన్నారు. ఆదివారం ఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయడంకోసం సిద్ధం కావాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యం

● మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూధన్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 28 : ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూధన్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని మెడ్వాన్ సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయులు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్కర్ హోనీపెని వారి సహకారంతో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

సీనియర్ల పేరుతో పార్టీని భ్రష్టు పట్టించారు

● బీజేపీ నాయకుల ఆరోపణ

తూప్రాన్, జనవరి 28: బీజేపీ నాయకులు సీనియర్ల పేరుతో కార్యకర్తలను పట్టించుకోకుండా పార్టీని భ్రష్టు పట్టించారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆదివారం తూప్రాన్‌లో బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా ప్రధానకార్యదర్శి నర్సింహారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు కొండ సిద్దిరాములుయాదవ్, ఓబీసీ మోర్చ జిల్లా కార్యదర్శి సాయిబాబాయాదవ్ విలేకర్లతో మాట్లాడారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుంచి పోటీ చేసిన ఈటల రాజేందర్ ఓటమికి తూప్రాన్ నాయకులు కొంత కారణమన్నారు. సీనియర్లమంటూ కార్యకర్తలను పట్టించుకోకుండా పార్టీ అభివృద్ధి విఘాతం కల్గిస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకరాజు, మల్లేశ్‌యాదవ్, టప్ప బాలేశ్, నల్ల వెంకటేశం, స్వర్గం రవి, చంద రాములు, చాకలి శివ, నాగరాజు పాల్గొన్నారు.